క్లుప్తంగా

వైభవంగా మాస శివరాత్రి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామ తీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో ఉన్న ఉమా సదాశివాలయంలో సోమవారం మాస శివరాత్రి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో తొలుత గణపతి పూజ చేసి, భక్తులతో ప్రత్యేక హోమాలు చేయించారు. అనంతరం పంచామృతాలతో ఉమా సదాశివుడికి అభిషేకం చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శక్తి సదన్ సందర్శన



శక్తి సదన్‌ను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ విమలారాణి

విజయనగరం ఫోర్ట్: నగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీలో ఉన్న మహిళా ప్రాంగణంలోని శక్తి సదన్ భవనాన్ని ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి సోమవారం సందర్శించారు. అక్కడి మహిళలతో మాట్లాడి, ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని అడిగారు. కార్యక్రమంలో ప్రాంగణం మేనేజర్ బి.రెబెకా, సూపరింటెండెంట్ కమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్ ఆదేశాలతో ఎస్‌ఐలు కృష్ణమూర్తి, మురళీలు తమ సిబ్బందితో వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ క్రమంలో నగరంలోని లంకాపట్నం, గాజులరేగ, దాసన్నపేట రింగ్‌రోడ్డు, వ్యాసనారాయణ మెట్ట రోడ్డు, కుమిలి రోడ్డు పరిసర ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న వారిని, మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వారిని గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారందరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కార్పొరేషన్ స్థలాల్లో బిల్డింగ్ మెటీరియల్ వేస్తే చర్యలు

విజయనగరం: కార్పొరేషన్ స్థలాలు ఆక్రమించి, బిల్డింగ్ మెటీరియల్ వేసి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఇదే విషయమై ఆయన ప్రణాళిక సిబ్బందికి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని 20 ప్రాంతాల్లో అనధికారికంగా ఇసుక, ఇటుక, పిక్కరాయి వంటివి వేసి విక్రయాలు చేపడుతున్నట్లు గుర్తించామన్నారు. వాటిని ఆయా స్థలాల్లో నుంచి రెండు రోజుల్లో తీసివేయకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా రహదారులు ఆనుకుని ఇలాంటి వ్యాపారాలు జరుగుతున్నాయని, దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విజయనగరం: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రజాగ్రంథాలయం ఆవరణలో జిల్లా కేంద్రానికి చెందిన వనిత, బాలాజీ, తోష్నివాల్, సాయికృష్ణ, ఈవినింగ్, ప్రగతి వాకర్స్ క్లబ్‌ల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా సేవల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న ప్రస్తుత క్లబ్‌ల సభ్యులను క్లబ్‌ల పూర్వపు గవర్నర్‌ల చేతులమీదుగా దుశ్శాలువాలతో సత్కరించారు. ఆ తర్వాత క్లబ్‌ల పూర్వపు గవర్నర్‌లనూ సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వపు గవర్నర్‌లు రాజు, కృష్ణంరాజు, ఎర్నాయుడు, సుభద్రాదేవి, అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలి

దత్తిరాజేరు: గ్రామాల్లో నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ విజయ భాస్కర్ వీఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వీఆర్‌ఓలు అంతా రోజూ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. నీటి తీరువా వసూళ్లకు సంబంధించిన డిమాండ్ నోటీసులు రైతులకు అందించి, డబ్బులను సచివాలయాల్లో చెల్లించే విధంగా చూడాలని సూచించారు. ఈనెలాఖరుకు 90 శాతం వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శులకు బదిలీ

దత్తిరాజేరు: మండలంలో అయిదుగురు పంచాయతీ కార్యదర్శులకు బదిలీ అయ్యిందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వంగర గ్రామ పంచాయతీ కార్యదర్శి అప్పారావు గజపతినగరం మండలం పాతబగ్గాం, గడసాం కార్యదర్శి శ్రీనివాసరావు తెర్లాం మండలం,తాడేందొరవలస కార్యదర్శి భాషా మెరకముడిదాం మండలం,గుచ్చిమి కార్యదర్శి ఇమంది లక్ష్మి జామి మండలం, దాసరిపేట కార్యదర్శి ప్రసాద్ గజపతినగరం మండలంలోని గుడివాడకు బదిలీ అయ్యారు.

ప్లాస్టిక్ ప్రమాదంలో.. ప్రజారోగ్యం!

- ప్లాస్టిక్‌తో పెనుప్రమాదం
- పెరిగిన ప్లాస్టిక్ లంచ్‌బాక్స్‌ల వినియోగం
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ప్రత్యామ్నాయ సామగ్రి వాడాలని నిపుణుల సూచన



విజయనగరం: అమ్మా..బడికి టైమ్ అవుతోంది..త్వరగా లంచ్‌బాక్స్ పెట్టమ్మా.. లేట్ అయితే బయట నిలబెడతారు. ఇలా..పిల్లల మాటలకు తల్లిదండ్రులు వేడివేడి ఆహారాన్ని ప్లాస్టిక్ లంచ్‌బాక్సుల్లో పెట్టి పంపించేస్తుంటారు. అయితే దాని పర్యావసానాలేంటో ఆలోచించడం లేదు. సాయంత్రం స్కూలు నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు కొంతదూరం నడిచినా అలసిపోవడం, దగ్గుతూ, తుమ్ముతూ ఉంటే తల్లిదండ్రులు కంగారుపడుతుంటారు. కానీ దానికి గల కారణాల్లో ప్లాస్టిక్ భూతమొకటని ఎంతమంది తెలుసుకుంటున్నారు. నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ సంచులు, బాక్సులు వాడొద్దని పదేపదే సూచిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ వాడకాన్ని ఆపాలని, ప్రత్యామ్నాయ సామగ్రి వాడకం వైపు దృష్టిసారించాలని వైద్యారోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

కంటికి ఇంపు..ఆరోగ్యానికి ముప్పు..

వేసవి సెలవులు ముగిసి, పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో వారం రోజులుగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నారు. వారికి మధ్యాహ్న భోజనం క్యారేజి పెట్టేందుకు చూడటానికి రంగురంగులతో అందంగా ఉండే ప్లాస్టిక్ బాక్సులను తల్లిదండ్రులు కొనుగోలు చేస్తున్నారు. తక్కువ ధర, కంటికి బాగా కనిపిస్తున్న ప్లాస్టిక్ వాడకం వెనక ప్రమాదం పొంచి ఉందని తెలుసుకోలేకపోతున్నారు. అటువంటి వారిని మరోసారి వైద్యారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రాణాలు తీసే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని చెబుతున్నారు.

హానికర రసాయనాలు..

ప్లాస్టిక్ బాక్సుల్లో ఆహారాన్ని నిల్వ చేసినప్పుడు అదే ప్లాస్టిక్‌లోని బిస్ఫినాల్-ఎ వంటి హానికర రసాయనాలు ఆహారంలోకి చేరుతాయి. అవి పిల్లల పెరుగుదల, హార్మోన్ల సమతుల్యతను బాగా దెబ్బతీస్తాయి. భవిష్యత్‌లో థైరాయిడ్, పునరుత్పత్తి సమస్యలు వస్తాయి. ఊబకాయం, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది.

నాడీ వ్యవస్థపై ప్రభావం..

ప్లాస్టిక్ డబ్బాలోని భోజనం తీసుకోవడంతో శరీరంలోకి మైక్రోప్లాస్టిక్స్ చేరి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. పిల్లల్లో నాడీ సమస్యలు, ఏకాగ్రత లోపం, ప్రవర్తన సమస్యలు ఏర్పడతాయని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది.

వేడి ఆహారం బాక్సుల్లో వేయొద్దు..



లంచ్‌బాక్సు కొనుగోలు చేసేటప్పుడు దాని తయారీకి వాడిన మెటీరియల్ గూర్చి తెలుసుకోవాలి. హానికర రసాయనాలు ఉండే ప్లాస్టిక్‌లు వాడకాన్ని పూర్తిగా మానేయాలి. ఒకవేళ కొన్న వాటిని కఠినమైన స్క్రబ్బర్లతో బాగా శుభ్రం చేస్తే ప్లాస్టిక్ ఉపరితలం దెబ్బతిని అందులోని రసాయనాలు ఆహారంలో తొందరగా చేరుతాయి. వీలైనంత వరకు వేడి ఆహారాన్ని ప్లాస్టిక్ బాక్సుల్లో పెట్టకపోవడం మంచిది. పదార్థాలు చల్లారిన తర్వాతే బాక్సుల్లో పెట్టాలి.

> **పాఠశాలల్లో నిషేధం తప్పనిసరి చేయాలి..**
>
> ప్లాస్టిక్ లంచ్‌బాక్సుల వాడకం అనేది పాఠశాలల్లో తప్పనిసరి చేయాలి. ప్లాస్టిక్ ఆరోగ్యంపై కలిగించే దుష్ప్రభావాలు పిల్లలు, వారి తల్లిదండ్రులకు సిబ్బందే అవగాహన కల్పించి, ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలి.
>
> – శ్రీనివాసరావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు

లంచ్‌బాక్స్‌లుగా ఇలాంటివి మేలు..

- **స్టెయిన్‌లెస్ స్టీల్:** పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసిన లంచ్ బాక్సులు వాడడం ఉత్తమం. వీటి ద్వారా రసాయనాలు ఆహారంలో కలిసే అవకాశం ఉండదు. తద్వారా ఆరోగ్యం దెబ్బతినదు.
- **గాజు..:** గాజు.. రసాయనాలు లేనిది. ఆహారానికి ఎటువంటి వాసన, రంగు అంటించదు. శుభ్రం చేయడం చాలా సులువు. కానీ పగిలిపోయే అవకాశం ఉంటుంది. వీటి వాడకం విషయంలో జాగ్రత్త ఉంటే చాలు. ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదు.
- **సిలికాన్ కంటైనర్లు..:** ఇవి సౌకర్యవంతంగా మడతపెట్టడానికి అనుకూలంగా ఉంటాయి. బీపీ–ఎ రహితమైనవి, ఆహారానికి సురక్షితమైనవి. నాణ్యమైన వాటిని ఎంచుకోవాలి.
- **వెదురు..:** వెదురుతో తయారు చేసిన లంచ్‌బాక్స్‌లు చాలా సౌకర్యవంతంగా ఉంటాయి. పర్యావరణానికి అనుకూలంగానూ ఉంటాయి. బ్రెడ్, శాండ్‌విచ్ వంటి పొడి పదార్థాలు ఉంచేందుకు ఇవి బాగా ఉపయోగపడుతాయి. అయితే ద్రవ, జిగురు పదార్థాలకు తగినవి కావు. పిల్లల ఆరోగ్యం చెడిపోతుంది.

'మత్తు'తో జీవితం చిత్తు



గంజాయి, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, సిగరెట్, మద్యం, సారాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనం(చిత్తు) అవుతుందని ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు అన్నారు. నెల్లిమర్ల మండలం, సతివాడ జేఎటీఎస్‌ఎం కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఎంతోమంది యువత ఫ్యాషన్ మాయలో పడి తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా మత్తు పదార్థాలకు బానిసలైన ఎంతోమంది జీవితాలు అంధకారంలో ఉన్నాయని, అలాంటి వాళ్లతో కన్నవాళ్లకు కూడా నరకమేనని వాపోయారు. ప్రతిఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచిబుద్ధులు అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

తహసీల్దారుకు వీఆర్‌ఏల సమ్మె నోటీస్



తహసీల్దారుకు సమ్మె నోటీస్ అందజేస్తున్న వీఆర్‌ఏలు

భోగాపురం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు రమణమ్మకు వీఆర్‌ఏలు సమ్మె నోటీసు సోమవారం అందజేశారు. ఆ సంఘ నాయకుడు చంద్రరావు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి జులై 9వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో తాము పాల్గొంటున్నామని తెలిపారు. వీఆర్‌ఏలకు తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా టైమ్ స్కేల్ జీతాలు ఇవ్వాలని, డీఏను కూడా జీతంలో కలపాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీ పోస్టుల భర్తీలో వీఆర్‌ఏల పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోగా ఇసుక ర్యాంపులు, రైస్‌మిల్లుల వద్ద బలవంతంగా నైట్‌డ్యూటీలు చేయిస్తోందని ఆరోపించారు. కావాలనే అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం తమను వేధిస్తోందని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్త సమ్మెలో వీఆర్‌ఏలంతా పాల్గొనాలని కోరారు.

అమెరికా స్వలాభం కోసమే యుద్ధాలు



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి కమిటీ వేదిక కన్వీనర్ అజశర్మ

- ఉత్తరాంధ్ర అభివృద్ధి కమిటీ వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ

విజయనగరం గంటస్తంభం: ప్రపంచంలో నేడు జరుగుతున్న జరుగుతున్న యుద్ధాలన్నీ ప్రపంచానికి పెద్దన్నగా చెప్పుకునే అమెరికా స్వలాభం కోసమేనని ఉత్తరాంధ్ర అభివృద్ధి కమిటీ వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ విమర్శించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'ప్రపంచ యుద్ధాలు దాని పర్యావసానాలు–పాలస్తీనాకు సంఘీభావం అనే అంశంపై సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అమెరికా దురహంకారానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల వెనక అమెరికా ప్రోత్సాహం లేకపోలేదన్నారు. ప్రపంచంలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య.. దేశంలో మణిపూర్‌లో రెండు తెగల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. మూడేళ్లుగా రష్యా, ఉక్రెయిన్‌ల యుద్ధం జరుగుతోందని, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ప్రస్తుతం యుద్ధం జరుగుతోందని, ఇజ్రాయెల్‌కి మద్దతుగా ఇరాన్‌పై అమెరికా బాంబులు వేసిందన్నారు. ఇరాన్ దేశం అణుబాంబులు తయారు చేస్తోందని చెప్పి ఇజ్రాయెల్ దానితో యుద్ధం చేస్తోందన్నారు. అణుబాంబులు అనేవి ప్రపంచానికి మంచివి కాదన్నారు. కానీ ఆ పేరుతో ఇరాన్‌పై దాడికి ఎగబడడం అన్యాయమన్నారు. అమెరికా ఐదు దేశాలకు ఎక్కువగా యుద్ధ సామగ్రి సరఫరా చేస్తోందన్నారు. అందులో ఇండియా, పాకిస్తాన్‌లు ఉన్నాయన్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థ బలం యుద్ధ సామగ్రిపై ఆధారపడి ఉందన్నారు. ఏ యుద్ధంలోనైనా లాభపడేది పెట్టుబడిదారులే నష్టపోయేది సామాన్యులే అని లెనిన్ చెప్పారని, ఆయన అన్న విధంగానే ఈ యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. యుద్ధాలు విరమించి, ప్రపంచ శాంతి స్థాపనకు ప్రపంచ దేశాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు పావని, జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన విద్యార్థులు

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులు



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ మేరకు బీజేపీ నేతలు ఆల్తి నల్లిబాబు, సోమినాయుడు, సత్యలింగం, అప్పలరాములు తదితరులు కార్యక్రమానికి హాజరై, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జన సంఘ్ పేరిట దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

నెల్లిమర్ల: స్థానిక బీజేపీ కార్యాలయంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సోమవారం నిర్వహించారు. బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు మైపాడ ప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బూసరి గౌరీశంకర్ తదితరులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం దేశానికి, బీజేపీకి ఆయన చేసిన సేవలు ప్రసాద్ కొనియాడారు. కార్యక్రమంలో వెలిచేటి రమేష్, భాషా, ప్రసాద్, శ్రీను, రాకేష్ పాల్గొన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ, గొల్లపేట దగ్గరున్న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ కోసం చేపట్టే ఈ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ఏడో తరగతిలో 2 సీట్లు, ఎనిమిదో తరగతిలో 1, తొమ్మిదో తరగతిలో 1 సీటు ఖాళీగా ఉన్నాయన్నారు.

రెండు బుట్టల విధానం పాటించాల్సిందే..

విజయనగరం: చెత్త సేకరణలో రెండు బుట్టల విధానం పాటించాల్సిందేనని నగరపంచాయతీ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ఆయన.. పలువురితో మాట్లాడి సమయానికి చెత్త తరలిస్తున్న వాహనాలు వస్తున్నాయా అని ఆరాతీశారు. అనంతరం స్థానికులకు పలు సూచనలు చేశారు. తడి,పొడి చెత్తలను వేర్వేరు డబ్బాల్లో వేసి పారిశుధ్య సిబ్బంది అందజేయాలని తెలిపారు. అనంతరం అన్న క్యాంటీన్‌కు వెళ్లి, అక్కడ ప్రజలకు అందిస్తున్న ఆహారంపై ప్రజాభిప్రాయం సేకరించారు.

రూ.3.82 కోట్లతో అభివృద్ధి పనులు



సమావేశంలో పాల్గొన్న మేయరు విజయలక్ష్మి, అధికారులు, తదితరులు

- కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం

విజయనగరం: నగరంలో వివిధ అభివృద్ధి పనులను రూ.3.82 కోట్లతో చేపట్టేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయరు వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 13 అంశాలను లేవనెత్తి వాటిపై సభ్యులు చర్చించారు. అనంతరం వాటిలో ఒకదానికి మినహా మిగిలిన 12 అంశాలకు సభ ఆమోదం తెలిపింది. మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలోని పలు డివిజన్‌లలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు ముమ్మరం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌వీవీ రాజేష్, సుంకరి నారాయణస్వామి, జీవీ రంగారావు, రేగాన రూపాదేవి, కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

రోడ్డు పక్క చెత్త తొలగింపు



చెత్త తరలింపు పనులు చేయిస్తున్న ఈఓపీఆర్డీ సుగుణాకరరావు

సాక్షి ఎఫెక్ట్...

గజపతినగరం: మరుపల్లి నుంచి మండల కేంద్రం గజపతినగరం వైపు వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్ప ల తొలగింపు పనులను అధికారులు ప్రారంభించారు. 'రోడ్డు పక్కనే చెత్త' అనే శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురిత మైన వార్తకు అధికారులు స్పందించారు. ఈఓపీఆర్డీ సుగుణాకరరావు పారిశుద్ధ్య కార్మికులతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను ట్రాక్టర్‌కు ఎక్కించి దూరంగా తరలించారు. అలాగే పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపడుతున్నారు.

తాగునీటి పైపులైన్‌కు లీకులు



గజపతినగరంలోని మేదరవీధిలో రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

గజపతినగరం రూరల్:

మండల కేంద్రంలోని మేదరవీధిలో తాగునీటి పైపు లైనుకు లీకులు కావడంతో తాగునీరు రోడ్డు మీదుగా వృథాగా పోతోంది. ఆరు నెలలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. పైపులైన్ లీకుల వల్ల కుళాయిల ద్వారా తాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదని, నీరు కలుషితమవుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. సమస్యను స్థానిక పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ వద్ద సాక్షి ప్రస్తావించగా వెంకటేశ్వరస్వామి కోవెల దగ్గరలో మూడు అడుగుల లోతు వరకు మెయిన్ పైపులైన్ తవ్వి చూశామని, అక్కడ లీకులు కనిపించలేదని చెప్పారు. త్వరలోనే లీకులను గుర్తించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

నిలిచిన ఉపాధి పనులు..!

- గంట్యాడ మండలంలో సగానికి పైగా గ్రామాల్లో నిలిచిన పనులు
- మండలంలో పంచాయతీల సంఖ్య: 36
- పనులు జరుగుతున్న పంచాయతీలు 8 నుంచి 10 లోపే..



మండలంలోని సిరిపురంలో పనులు చేస్తున్న వేతనదారులు(ఫైల్)

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను నెల రోజుల క్రితమే నిలిపివేశారు. దీంతో ఉపాధి వేతనదారులు పనులు లేక ఇంటికే పరిమితమయ్యారు. లక్కిడాం గ్రామంలో కూడా రెండు వారాల క్రితం పనులు నిలిచిపోవడంతో వేతనదారులు ఖాళీగా ఉంటున్నారు. ఈరెండు గ్రామా ల్లోనే కాదు. మండలంలోని అధికశాతం గ్రామాల్లో ఉపాధి పనులు నిలిచిపోయాయి. చేసేది లేక కొంతమంది సిమెంట్, ఇటుక బట్టీలు వంటి పనులకు వెళుతున్నారు. మరి కొంతమంది విజయనగరం, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు పనుల కోసం వెళ్లాల్సి వస్తోంది. అడిగిన వారందరికీ పని కల్పిస్తాం అంటూ ఉపాధి హామీ అధికారులు ప్రకటనలు ఇస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటుంది. ఎన్నిసార్లు అడిగినా పని కల్పించడం లేదని పలు గ్రామాల్లో వేతనదారులు ఆరోపిస్తున్నారు. పనులు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపి స్తున్నాయి.

సగం రోజులు కూడా పని కల్పించని వైనం

మండలంలో 36 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కేవలం 8 నుంచి 10 పంచాయతీల్లోనే ఉపాధి పనులు జరుగుతున్నట్టు సమాచారం. ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం జాబ్‌కార్డు ఉన్న వారికి వందరోజులు పని కల్పించాల్సి ఉన్నప్పటికీ మండలంలో చాలా గ్రామాల ప్రజలకు అధికారులు సగం రోజులు కూడా పనికల్పించ లేకపోయారు. రోజుకు సగటున 15 వేల వరకు వేతనదారులు పనులకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం 5వేలు లోపే హాజరవుతున్నట్టు తెలుస్తోంది.ఉపాధి సిబ్బంది కొన్ని గ్రామాల్లో కావాలనే పనులు నిలిపివేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో పనులు ఎందుకు జరగడం లేదన్నది కూడా ఉపాధి అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదని వేతనదారులు మండిపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో 30 నుంచి 40 రోజులే పనికల్పించగా, మరికొన్ని గ్రామాల్లో కేవలం 15 నుంచి 20 రోజులే పని కల్పించారంటే ఉపాధి హామీ పథకం అమలు తీరు ఎలా ఉందో అర్థం కాక మానదు.

> **విచారణ చేపడతాం..**
>
> ఉపాధి పనులు నిలిపివేయాలని ఏ ఫీల్డ్ అసిస్టెంట్‌కు చెప్పలేదు. కొన్ని గ్రామాల్లో పనులు చేయడానికి అవకాశం లేదని చెప్పి కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు నిలిపివేశారు. మిగతా చోట ఎందుకు పనులు జరగడం లేదో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
>
> – గర్బాపు సుందరరావు, ఏపీఓ, గంట్యాడ